క్లుప్తంగా

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

కొయ్యలగూడెం: వినాయక చవితి మండపాల ఏర్పాటుకు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై జీజే విష్ణువర్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణకు స్థల యజమానుల అనుమతి తీసుకోవాలని, ఫైర్, విద్యుత్, శాఖల అనుమతితో నిబంధనల ప్రకారం పందిళ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద అగ్నిప్రమాదాలు సంభవించకుండా ఇసుక, నీళ్లను అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని, స్పీకర్లు ఉదయం ఆరు నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వాడాలని తెలిపారు. మండపాల వద్ద రాత్రి వేళ కమిటీ ప్రతినిధులు కాపలా ఉండాలన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు ప్రారంభించారు. సర్పంచ్ రాధిక మాట్లాడుతూ రూ.33.80 లక్షలు మంజూరవడంతో గ్రామంలో ఐదు రోడ్లు, 12 డ్రెయినేజీలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రెండు రోడ్ల నిర్మాణం పూర్తయిందని, మరో రెండు రోడ్డు పనులు ప్రారంభించామని వివరించారు. ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, పార్టీ నాయకులు పోల్నాటి రాజా పాల్గొన్నారు.

కోడెనాగు హల్‌చల్

కొయ్యలగూడెం: బ్రహ్మల కాలనీలో జనావాసాల మధ్య కోడెనాగు శుక్రవారం హల్‌చల్ చేసింది. స్థానికులు గవరవరం గ్రామానికి చెందిన పాతకోట గోపాలకృష్ణకు సమాచారం అందజేయగా అతను వచ్చి కోడెనాగును చేత్తో పట్టుకున్నాడు. జన సంచారం లేని ప్రాంతాల్లో వదిలివేస్తానని గోపాలకృష్ణ తెలిపారు.

భద్రత కల్పనే లక్ష్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలో 19 సచివాలయాల్లో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు జీవిత బీమా సౌకర్యం కల్పించే ప్రక్రియ పూర్తి చేసినట్టు సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారధి అన్నారు. మండలంలోని టెక్కినవారిగూడెంలో జరిగిన బీమా సౌకర్యం కల్పించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

మళ్లీ ఎద్దెలవాగు వంతెన మునక

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం శుక్రవారం 33 అడుగులకు పెరగడంతో వేలేరుపాడు మండలం కొయిదా రహదారిలో ఎద్దెలవాగు వంతెన శుక్రవారం మళ్లీ నీట మునిగింది. దీంతో దిగువన ఉన్న 16 గిరిజన గ్రామాలకు మండల కేంద్రమైన వేలేరుపాడు నుంచి రాకపోకలు స్తంభించాయి. దిగువ ప్రాంతంలోని కొయిదా, కట్కూరు, కాచారం, తాళ్లగొంది, పూసుగొంది, చిట్టంరెడ్డిపాలెం, ఎడవల్లి, బుర్రెడ్డిగుడెం, టేకూరు, సిద్దారం, కుంకుడు కొయ్యలపాకలు, మరో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటి వరకు మూడు నెలలుగా ఈ వంతెన నీటమునగడం ఇది ఆరోసారి. శుక్రవారం సాయంత్రం ఎద్దెలవాగు వద్ద అధికారులు నాటు పడవను ఏర్పాటు చేశారు.

కొండ చిలువ హల్‌చల్

టి.నరసాపురం: మండలంలోని లంకాపల్లి గ్రామంలో రైతు ఆచంట సూర్యనారాయణకు చెందిన పామాయిల్ తోటలో 12 అడుగుల కొండచిలువ శుక్రవారం హల్‌చల్ చేసింది. పామాయిల్ కాయలు ఏరుతున్న కూలీల కంట పడింది. వారు రైతు సూర్యనారాయణకు తెలియజేయడంతో ఆయన స్నేక్ క్యాచర్ ప్రదీప్‌కు సమాచారం ఇచ్చారు. ప్రదీప్ అక్కడకొచ్చి కొండచిలువను పట్టుకుని అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి విడిచి పెట్టారు.

అమూల్ పాలవెల్లువ రుణమేళా

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల మండలం జాజులకుంట గ్రామంలో డీసీసీబీ ఆధ్వర్యంలో అమూల్ పాలవెల్లువ రుణమేళా నిర్వహించారు. పశువైద్యాధికారి ఎస్ రమేష్ మాట్లాడుతూ టర్మ్ లోను ఆవుకి రూ.75 వేలు, గేదెకి రూ.95 వేలు ఇస్తారని, 12 శాతం వడ్డీ ఉంటుందని తెలిపారు. గేదెను, ఆవును కొని అమూల్‌కి కేంద్రానికి పాలు పోయాలన్నారు. పెట్టుబడి రుణం రూ.30 వేలకి వడ్డీ 7.5 శాతం ఉంటుందని, ఐదుగురి సభ్యులతో గ్రూప్‌గా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఐత్తుల బేబి సంతు, ఎంపీటీసీ వసంతలక్ష్మి, డీసీసీబీ సిబ్బంది మహేష్, పశువైద్యాధికారి ఎస్ రమేష్, సచివాలయ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

జంగారెడ్డిగూడెం: ఆరోగ్యమే మహా భాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయస్థానాల ప్రాంగణంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది వైద్య పరీక్షలను పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు ఐ.సందీప్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో జ్యుడిషల్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్ తేజస్వి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు, న్యాయవాదులు కోర్టు సిబ్బంది, కోర్టు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంలో చిరు వ్యాపారులకు జగనన్న తోడు

- పోలవరం నియోజకవర్గంలో 5,634 మందికి లబ్ధి
- వడ్డీ లేని రుణాలు రూ.37.80 కోట్లు జమ

బుట్టాయగూడెం: కష్టాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తోన్న చిరు వ్యాపారులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. ప్రజాసంకల్ప యాత్ర పాదయాత్ర సందర్భంగా ఇచ్చినమాట ప్రకారం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకం ద్వారా వడ్డీ లేని రుణాలను అందిస్తున్నారు. వారి అభివృద్ధికి పాటుపడుతున్నారు. ఇప్పటి వరకు మూడు సార్లు చిరువ్యాపారుల బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము జమ చేశారు. వడ్డీ లేని రుణాలిచ్చి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తోన్న సీఎం జగన్‌కు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.


జగనన్న తోడు పెట్టుబడితో చిరు వ్యాపారం చేస్తున్న మహిళ


దొరమామిడిలో బజ్జీల వ్యాపారం చేస్తున్న మహిళ

5,634 మందికి రూ.37.80 కోట్ల జమ

జగనన్న తోడు పథకంలో పోలవరం నియోజకవర్గంలో 2022 నుంచి 2023 – 24 ఆర్థిక సంవత్సరం వరకు 5,634 మంది చిరు వ్యాపారుల ఖాతాల్లోకి సుమారు రూ.37.10 కోట్ల వడ్డీ లేని రుణాలను జమ చేశారు. మండలాల వారీగా బుట్టాయగూడెంలో 1436 మందికి రూ.1.43 కోట్లు, జీలుగుమిల్లిలో 719 మందికి రూ.71.90 లక్షలు, కొయ్యలగూడెంలో 240 మందికి రూ.34.04 లక్షలు, కుక్కునూరులో 888 మందికి రూ.88.80 లక్షలు, పోలవరంలో 792 మందికి రూ.79.40 లక్షలు, టి.నర్సాపురంలో 204 మందికి రూ.36.11 లక్షలు, వేలేరుపాడులో 339 మందికి రూ.33.90 లక్షలు చొప్పున జమయ్యాయి.

కిరాణా కొట్టే జీవనాధారం



గతంలో కూలి పనులకు వెళ్లేదాన్ని. ఎండలో పనులు చేయలేక మా గ్రామ సమీపంలోనే చిన్న కిరాణా కొట్టు ఏర్పాటు చేసుకున్నాను. సరుకుల అమ్మకాల్లో ఖర్చులు పోనూ రోజుకు రూ.200 మిగిలేవి. జగనన్న తోడులో రూ.10 వేలు నా బ్యాంక్ ఖాతాలో వేశారు. ఆ సొమ్ముతో కొట్టులో అన్ని రకాల సరుకులు తెచ్చి విక్రయిస్తున్నాను. దీంతో గిరాకీ పెరిగింది. నాకు వడ్డీ లేకుండా రుణాలు ఇచ్చిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

– నిట్టా విమల కుమారి, ముప్పినవారిగూడెం, బుట్టాయగూడెం మండలం

స్వశక్తితో ఎదిగేందుకు తోడు



కూరగాయలు, కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్నాను. వ్యాపార అభివృద్ధికి పెట్టుబడి కోసం అప్పు కోసం తిరిగినా ఫలితంలేదు. అనుకోకుండా జగనన్న తోడు పథకంలో వడ్డీ లేని రుణం అందింది. దీంతో మా షాపు నిండుగా సరుకులను ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్నాను. మా కుటుంబం జగనన్నకు రుణపడి ఉంటాం.

– దాసరి లక్ష్మీ పార్వతి, బీసీ కాలనీ, బుట్టాయగూడెం మండలం

థ్యాంక్యూ సీఎం సార్



చిరు వ్యాపారులకు సీఎం జగన్ అండగా ఉంటున్నారు. ఇచ్చిన మాట ప్రకారం వడ్డీలేని రుణాలను అందిస్తూ మాకు భరోసా కల్పిస్తున్నారు. రూ.10 వేలు పెట్టుబడిగా పెట్టి మేము చేసే వ్యాపారాల్లో ఇబ్బంది లేకుండా ముందుకు సాగుతున్నాం. పండ్ల వ్యాపారం చేస్తున్నాం. జగనన్న తోడు ఆసరాగా నిలిచింది. థ్యాంక్యూ సీఎం జగనన్న.

– నందం పద్మ, ముప్పినవారిగూడెం, బుట్టాయగూడెం మండలం

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతానికి కృషి

బుట్టాయగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి కోరారు. కార్యక్రమ నిర్వహణపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సర్పంచ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఎస్ వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, డాక్టర్లు ఎ.చందన్ మాథుర్, సుధాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

బుట్టాయగూడెం మండలంలో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష షెడ్యూల్‌ను ఎంపీడీఓ ఎస్ వేణుగోపాల్‌రెడ్డి వెల్లడించారు. ఒక బృందంలో ఎంపీడీఓ, రెండో బృందంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 30న రాజానగరం, అక్టోబర్ 3న బుట్టాయగూడెం-2, 4న రెడ్డిగణపవరం, 5న జైనవారిగూడెం, 6న దొరమామిడి-2, 7న అలివేరు, 9న కోటనాగవరం, 10న అచ్చియ్యపాలెం, 11న నూతిరామన్నపాలెం, 12న కామయ్యకుంట, 13న బుట్టాయగూడెం-1, 16న లక్ష్మణుగూడెం, 17న నిమ్మలగూడెం, 18న సీతప్పగూడెం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.


బుట్టాయగూడెంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

జగనన్న ఆరోగ్య సురక్షణపై అవగాహన

కామవరపుకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా, ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా చేపడుతోన్న జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతి గ్రామానికి వెళ్లి కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.శ్రీదేవి, డాక్టర్ సునీల్ వర్మ, వైస్ ఎంపీపీ గిరిజ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్

జగనన్న సురక్షతో మేలు

కొయ్యలగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతానికి పటిష్ట చర్యలు చేపట్టామని ఎంపీడీఓ ఆర్.బేబీశ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంజిమాల రామారావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష విధివిధానాలను ఆమె వివరించారు. తహసీల్దార్ పాసం నాగమణి ఒక బృందానికి, తాను మరో బృందానికి నేతృత్వం వహిస్తున్నట్టు ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు కలిగే మేలుపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన

టి.నరసాపురం: జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలని ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అధికారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంగా కుమారి, వైద్యులు డా.ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

ఎంపీపీ వెంకటరెడ్డి

పోలవరం రూరల్: దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇల్లు లేదా స్థలం అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన పోలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇళ్ల కోసం పోలవరం గ్రామంలో రెండు ప్రదేశాల్లో స్థలాలు కేటాయించి, లబ్ధిదారులకు పట్టాలు అందించామని, ఇళ్లు నిర్మించుకునేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో మంజూరైన ఇళ్లకు సంబంధించి నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాల్లో నిర్వాసితుల సమస్యలు పరిష్కారానికి అధికారులు శ్రద్ధ కనబర్చడం లేదని ఎంపీటీసీ మాడే ఆనంద్ తెలిపారు. నిర్వాసితులు ఇంకా పోలవరం మండలంలో ఉన్నట్టే కొనసాగుతుడడంతో సమస్యలను సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పరిష్కరించాలని కోరారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. శాఖల వారీగా అభివృద్ధి పనులను అధికారులు వివరించారు. సమావేశంలో తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ జి.శ్రీను, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, ఎంపీటీసీలు మిడియం సింగరాజు, ఆకుల వరలక్ష్మి, దెగపాటి హరిరామకృష్ణ, వలవల వరలక్ష్మి, కాశీ ధనలక్ష్మి, యామల శ్రీదేవి, కుంజం చిట్టెమ్మ, దాపర్తి మోహన్‌రావు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


పోలవరం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవం

జంగారెడ్డిగూడెం: స్థానిక సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో ఆవిర్భావ వేడుక ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. కళాశాల అభివృద్ధి కమిటీ, పూర్వ విద్యార్థులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల స్థాపించి నేటికి (శుక్రవారానికి) 49 సంవత్సరాలు పూర్తి చేసుకుని 50 సంవత్సరంలోకి అడుగు పెట్టిందని ప్రిన్సిపాల్ తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి స్వర్ణోత్సవ సంవత్సరంగా ప్రకటించామని, కళాశాలలో జరిగే కార్యక్రమాలు స్వర్ణోత్సవాల్లో భాగమే అని ప్రకటించారు. విద్యావేత్త, దివంగత మూర్తిరాజు స్థాపించిన ఈ కళాశాల అనేకమందిని ఉన్నతస్థానాలు అధిరోహించేలా తర్ఫీదు ఇచ్చిందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల సీపీడీసీ సెక్రెటరీ మొగళ్లపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూర్తి రాజు ఆశయాన్ని నెరవేర్చాలన్నారు. రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ వైఎస్‌వీ శేషగిరి మాట్లాడుతూ ఈ కళాశాలలో పనిచేసి రిటైర్ అవ్వడం అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలలో సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం మధు, కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ సీహెచ్ రమాదేవి, మెంబర్స్ జీవీ లాల్, పీఎస్ రావు, వి.హనుమంతరావు, కేవీవీ శిరీష తదితరులు పాల్గొన్నారు.


స్వర్ణోత్సవ సంవత్సరంగా ప్రకటిస్తున్న దృశ్యం

ఘనంగా ఇంజినీర్స్ దినోత్సవం


రాధాకృష్ణను సన్మానిస్తున్న ఉద్యోగులు


కో ఏఈ వెంకట రమణను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఏపీఈఈ (1104) ఉద్యోగులు శుక్రవారం ఇంజినీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటీవల ఏపీఈపీడీసీఎల్ డీఈఈ నుంచి ఏఈగా పదోన్నతి పొందిన పి.రాధాకృష్ణను ఘనంగా సన్మానించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

చింతలపూడి: విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. ట్రాన్స్‌కో ఏఈ వెంకట రమణను ఘనంగా సత్కరించారు.

మోక్షగుండంకు ఘన నివాళి

కొయ్యలగూడెం: జాతీయ ఇంజినీర్స్ డేని పీడబ్ల్యూడీ సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని జాతీయ ఇంజినీర్స్ డే గా నిర్వహించుకోవడం భారతజాతి ఆయనకిచ్చిన గౌరవం అని డీఈ రవీంద్రబాబు పేర్కొన్నారు. గ్రంథాలయంలో లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే వేడుక నిర్వహించారు.

కె.కోటలో..

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఇంజినీర్స్ డేని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం మల్లేశ్వరరావు అధ్యక్షతన జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు.

శాకంబరిగా నూకాలమ్మ దర్శనం

జంగారెడ్డిగూడెం: శ్రావణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో భాగంగా నిజ శ్రావణమాస పోలాల అమావాస్యను పురస్కరించుకుని స్థానిక నూకాలమ్మవారు శాకంబరి అలంకరణలో పూజలు అందుకున్నారు. ఆలయ కల్యాణ కళా వేదిక వద్ద ముత్తైదువులచే సామూహిక కుంకుమార్చన, నిత్య పూజా కైంకర్యాలు, సాయం సంధ్యా హారతి నిర్వహించారు. అమ్మవారి అలంకరణకు కూరగాయలు స్థానిక సాయి ట్రేడర్స్ వారు, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రసాద వితరణకు గడ్డి అచ్యుతరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబీకులు రూ.10,116 విరాళంగా ఇచ్చారని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. సోమవారం వినాయక చవితి సందర్భంగా ఆలయంలో నిర్వహించే వినాయక వ్రత పూజ, సహస్ర మోదక లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్ని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కేఎల్ఎన్ ధనకుమార్ వేద ప్రవచనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, రొంగల నాగేశ్వరావు, చిట్లూరి సుబ్బారావు, పోలుపర్తి రాము, త్రిపుర రమేష్, చింతకాయల అచ్చిరాజు, గడ్డి అంజలి, విజయలక్ష్మి, జయ ఆదిత్య దుర్గా ఫణీంద్ర పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే వినియోగించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి


మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బాబ్జి


కిడ్స్ పాఠశాలలో మట్టి విగ్రహాలు తయారీ చేస్తున్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: చవితి వేడుకల్లో పర్యావరణహితమైన మట్టి విగ్రహాలనే వినియోగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జిలు అన్నారు. స్థానిక కిడ్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏపీ పొల్యూషన్ బోర్డు (ఏలూరు), స్పార్క్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ అనుకూల వినాయక చవితి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సింహాద్రి తినాథ్ పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటిలో కరగడానికి సమయం తీసుకోవడంతో పాటు, నీటిని హానికరమైన రసాయనాలతో పాడు చేస్తుందని అన్నారు. పొల్యూషన్ బోర్డు ఎన్.వెంకటరమణ, సీఐ రాజేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు విద్యార్థులకు మట్టి విగ్రహాల ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల పోటీ నిర్వహించారు. విద్యార్థులకు విగ్రహాలను అందజేశారు. కార్యక్రమంలో నళిని, రామా, శిరీష, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుండేటివాగు వంతెన మునక

కుక్కునూరు: గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలతో గోదావరికి స్వల్పంగా వరద ఉధృతి పెరిగింది. దీంతో కుక్కునూరులోని గుండేటివాగు వంతెన నీట మునిగింది. ఫలితంగా కుక్కునూరు మీదుగా దాచార, గొమ్ముగూడెం పంచాయతీలకు, వేలేరుపాడు మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి. గడిచిన రెండు మూడు వారాల్లో గుండేటి వాగు వంతెన నీటమునగడం ఇది మూడోసారి.

1 నుంచి విర్డ్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆసుపత్రిలో అక్టోబర్ 1 నుంచి మూడు రోజులపాటు భుజం, మోచెయ్యి శస్త్ర చికిత్సలను నిర్వహించనున్నట్టు ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కామినేని శ్రీధర్ ఈ శస్త్ర చికిత్సలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. షోల్డర్, ఎల్బో, షోల్డర్ డిస్క్ లొకేషన్, రొటేటర్ కట్ గాయాలు, షోల్డర్ ఆర్థరైటిస్ సమస్యలతో బాధపడేవారు ఈ సేవలను వినియోగించుకోలని తెలిపారు. ఈనెల 25వ తేదీ లోపు రోగులకు వీర్డ్‌లో ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇంప్లాంట్స్‌ను అమెరికా నుంచి తీసుకొస్తున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 83744 45108లో సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఆర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎనుమలేటి చైతన్య ప్రసాద్ ఈనెల 9న తాడేపల్లిగూడెం సీసీ కెమేరాలు బిగించే పని ఉందని వెళ్లి తిరిగిరాలేదని భార్య లతా మంగేష్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

నేడు కామవరంలో గడపగడపకు మన ప్రభుత్వం

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం మోతుగూడెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఉదయం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు తెలిపారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొని పథకాలను ప్రజలకు వివరిస్తారని చెప్పారు. అనంతరం 11 గంటలకు అంతర్వేదిగూడెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

కొబ్బరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

టి.నరసాపురం: కొబ్బరి రైతులు శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య పద్ధతులు పాటించి, అధిక దిగుబడులు సాధించాలని విజయరాయి ఉద్యాన కేంద్రం పరిశోధకులు తిరుపతిరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యాన, కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో రైతులకు కొబ్బరి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కొబ్బరి సాగులో చిన్న చిన్న మార్పులు దిగుబడి పెంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సూక్ష్మ పోషక దాతు లోపాలు లేకుండా చూడాలన్నారు. కొబ్బరి సాగులో అంతర పంటలు కూడా సాగు చేయడం లాభదాయకమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోదుగు సునంద, ఉద్యాన అధికారి లల్ పతి, సిబిడి సాంకేతిక అధికారి కిరణ్ మరియు రైతులు పాల్గొన్నారు.

డ్రైడేతో డెంగీ, మలేరియాలకు చెక్

చింతలపూడి: ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం ద్వారా డెంగీ, మలేరియాలకు చెక్ పెట్టవచ్చునని కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్ కృష్ణకిషోర్ అన్నారు. చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామంలో శుక్రవారం డ్రైడే–ఫ్రైడే ర్యాలీ నిర్వహించారు. దోమల నిర్మూలనకు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు కృష్ణకిషోర్ చెప్పారు. సబ్‌యూనిట్ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలన్నారు. గ్రామ పంచాయతీల సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వార్డు వలంటీర్లు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.భరత్ కుమార్, నర్మదా రాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాడి పశువుల పెంపకంతో అధిక ఆదాయం

చింతలపూడి: వ్యవసాయంతో పాటు పాడి పశువులను పెంచుకోవడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు అన్నారు. సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గోద్రెజ్ ఆగ్రో టెక్ సహకారంతో చింతంపల్లి పంచాయతీ మేడిశెట్టివారిపాలెం గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరంలో డాక్టర్ శివనాగేంద్రబాబు బృందం ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. మూడు నెలలకోసారి పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సర్పంచ్ రామకృష్ణ కోరారు. రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎ.మహేశ్వర్రావు, సురేష్,సేవా సంస్థ కార్యదర్శి యు.రాజారావు, ఉప సర్పంచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.